క్లుప్తంగా

తెలంగాణ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక




చుక్క శ్రీకాంత్ రెడ్డి ప్రశాంత్

నల్లబెల్లి : తెలంగాణ ఆటో యూనియన్ నల్లబెల్లి అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన చుక్క శ్రీకాంత్ మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రధాన కార్యదర్శిగా రెడ్డి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా బొట్ల రాజు, సహాయ కార్యదర్శిగా బొట్ల సాంబయ్య, కోశాధికారిగా నాదునూరి మహేందర్, గౌరవ అధ్యక్షుడిగా జరుపుల నారాయణ సింగ్, ముఖ్య సలహాదారుడిగా గొడిశాల నరేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు చుక్క శ్రీకాంత్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



రాయపర్తి : మండలకేంద్రంలో అంబేడ్కర్ కాలనీవాసులు బోనాల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని గ్రామదేవతలైన మారెమ్మ, ముత్యాలమ్మకు బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో సందడివాతావరణం నెలకొంది.

అనారోగ్యంతో మహిళ మృతి

చెన్నారావుపేట : పాపయ్యపేట గ్రామానికి చెందిన పొన్నాల ఎల్లమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు, భర్త రాములు ఉన్నారు. పేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు వేసుకుని అంత్యక్రియలు చేశారు. బహుజన ఐక్యవేదిక, నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్ గుండాల మదన్‌కుమార్.. ఎల్లమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబాన్ని ఆదుకుంటానని ధైర్యం చెప్పారు.

చెట్టును ఢీ కొట్టిన లారీ



వర్ధన్నపేట : మలుపు వద్ద అదుపు తప్పి లారీ చెట్టును ఢీకొన్న సంఘటన ఆదివారం ఉదయం ఇల్లందలో చోటుచేసుకుంది. లూజ్ సిమెంట్ ట్యాంకర్ లారీ రామగుండంలో లూజ్ సిమెంట్‌ను అన్‌లోడ్ చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలు కాగా లారీ ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ప్రాణ నష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ రోడ్డు సమీపంలో వరుస ప్రమాదాలు జరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల ఆటోను లారీ ఢీకొని ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరుసటి రోజు సమీపంలో ఉన్న మలుపు వద్ద బైక్ అదుపు తప్పి యువకులకు గాయాలయ్యాయి. ఇప్పటికైనా రోడ్డు పక్కన ప్రమాద సూచికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



సంగెం : మండలంలోని బీకోజీ నాయక్ తండా శివారు తూర్పు తండాకు చెందిన జాటోత్ రామన్ అనారోగ్యంతో మరణించాడు. కాగా ఆదివారం స్థానిక నవయువ యూత్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.6వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు చంటి, సభ్యులు కిషన్‌నాయక్, ప్రవీణ్, విజేందర్, శ్రీకాంత్, రాజు, మహేష్ ఉన్నారు.

పరామర్శ



ఖానాపురం : మండలంలోని అశోక్ నగర్ గ్రామానికి చెందిన కౌసల్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని చెన్నారావుపేట బీఆర్‌ఎస్ నాయకుడు బాల్నె వెంకన్న ఆధ్వర్యంలో పరామర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌లు అనుముల కుమారస్వామి, కొండవీటి ప్రదీప్‌కుమార్, స్వామి, అమ్మ రాజేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం నాయకులు సమ్మయ్య, సాయిలు, ఉపసర్పంచ్ రాములు, పరామర్శించారు. రాజేందర్, ఈర్య, లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

బురదమయంగా బీటీ రోడ్డు

- రహదారిపై అడుగుకో గుంత
- ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు, ప్రజలు
- చిత్తడిగా తిమ్మాపూర్–తూర్పు తండా రోడ్డు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



బురదమయంగా మారిన బీటీ రోడ్డు



వర్షపు నీటితో నిండిన గుంతలు

సంగెం : గ్రామాల్లోని రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి.. బీటీ రోడ్లు ధ్వంసమై గుంతలుగా మారడంతో రోడ్డు గుండా వెళ్లే ప్రయాణికులు భయపడుతున్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అడుగుకో గుంత ఏర్పడ్డాయి. మండలంలోని తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ స్టేషన్, తూర్పుతండా మీదుగా నెక్కొండ మండలం చంద్రుగొండకు వెళ్లే 5 కిలోమీటర్ల మేర రోడ్డు నరకానికి నకలుగా మారింది. అడుగడుకు గుంత ఏర్పడటంతో పాటుగా రైల్వే ట్రాక్ సమీపంలో సుమారు 300 మీటర్లకు పైగా బీటీ రోడ్డు కొట్టుకుపోయి బురద పొలాన్ని తలపిస్తోంది. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించాలంటేనే జనం భయంతో వణికిపోతున్నారు. ద్విచక్రవాహన దారులు, ఆటోలు, ట్రాలీలు, ఇతర వాహనాలు రిపేర్‌కు రావడంతో పాటు నడుములు పట్టుకుని ఆస్పత్రి పాలు కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీటితో గుంత ఎక్కడ ఉందో తెలియక పలువురు ద్విచక్ర వాహనదారులకు అందులో పడిపోతున్నారు. బురదపొలంను తలపిస్తున్న రోడ్డుపై జారీ పడిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన బీటీ రోడ్డును మరమ్మతు చేయించాలని పలువురు వేడుకుంటున్నారు.

మరమ్మతు చేపట్టాలి



తిమ్మాపూర్ నుంచి తూర్పుతండా వరకు బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటేనే వణుకు వస్తుంది. గుంతల వల్ల వాహనాలు తొందరగా దెబ్బతింటున్నాయి. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

- సపావట్ శ్రావణ్, ట్రాలీ డ్రైవర్

ప్రతిపాదనలు పంపించాం..

మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డు ధ్వంసమైంది వాస్తవమే. బీటీ రెన్యూవల్ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

-రమేష్‌కుమార్, ఏఈ, పీఆర్

పోలీసులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట : హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో అర్ధరాత్రి గిరిజన మహిళపై దాడికి పాల్పడిన పోలీసులను కఠినంగా శిక్షించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మొగిలిచర్ల సందీప్, గుర్రం అజయ్, బానోత్ రామన్న నాయక్, రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్లో ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలన్నారు. గిరిజన మహిళ వద్ద ఉన్న డబ్బులు, బంగారం దోచుకున్న పోలీసులపై దారి దోపిడీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా, డబుల్ బెడ్రూంతో పాటు పిల్లల ఉన్నత చదువుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నవీన్ నాయక్, రాజు నాయక్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ఆదివారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్, బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, పీఏసీఎస్‌వైస్ చైర్మన్ చిట్యాల వెంకటేశ్వర్లు, గ్రామపార్టీ అధ్యక్షుడు వంగాల నర్సయ్య, తోట సుదర్శన్, తోట నర్సింగం, మాచర్ల సోమనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

నల్లబెల్లి : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి అన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అర్హులైన వారికి ప్రాధాన్యత క్రమంలో గొర్రెలు, గృహలక్ష్మి, బీసీ, మైనార్టీ, దళిత బంధు పథకాలను అందిస్తామన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్)కి చెందిన నాగంపల్లి సాంబయ్యతో పాటు పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి సారంగపాణి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో సర్పంచ్ దాసి పూలమ్మ, గ్రామ అధ్యక్షుడు పిండి కుమారస్వామి, నాయకులు కూస లింగయ్య, బదావత్ రవి, కొమురయ్య, ఇమ్మడి రమేష్, సాయిలు, కర్దూరి సురేందర్, సంఘ కుమారస్వామి, ఎల్లబోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ

శాయంపేట : మొక్కలతోనే మానవ మనుగడ ఉందని సీఎస్ఐ చర్చి పాస్టర్ డి.అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని చర్చి ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు.

అడవి పందుల బీభత్సం

- మొక్కజొన్న పంట చేలు ధ్వంసం



అడవిపందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

దుగ్గొండి : అడవిపందులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రంతా పంట చేలలో తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. మండలంలోని గిర్నిబావి గ్రామానికి చెందిన పెండ్లి రమేష్ 2 ఎకరాలు, అనుముల కుమారస్వామి ఎకరం భూమిలో మొక్కజొన్న పంట సాగు చేయగా పీసు వేసి గింజలు పాలు పోసుకుంటున్న తరుణంలో అడవిపందులు నాశనం చేశాయి. ఆదివారం ఉదయం వ్యవసాయ భూమి వద్దకు వెళ్లిన రైతులకు పంటంతా నాశనం కావడం కనిపించింది. దీంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇదే క్రమంలో దాదాపు 20 మంది రైతుల మొక్కజొన్న చేలలో అడవిపందులు స్వల్పంగా నాశనం చేశాయి. అధికారులు స్పందించి అడవిపందుల బారినుంచి పంటలను కాపాడుకునే మార్గాలు సూచించాలని రైతులు కోరుతున్నారు.

'చల్లా'కే ఉద్యమకారుల మద్దతు

ఆత్మకూరు : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికే తమ పూర్తి మద్దతు ఉంటుందని, చల్లా నాయకత్వంలో పనిచేస్తామని మండలానికి చెందిన తెలంగాణ ఉద్యమకారులు స్పష్టం చేశారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ధర్మారెడ్డిని ఉద్యమకారులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు కాలం సాంబరెడ్డి, పెరుమాండ్ల అనిల్, ఒడ్డెపల్లి నర్సయ్య, గౌని రాజు, వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంగాల స్వాతిభగవాన్‌రెడ్డి, పాపని రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

'భూ ఆక్రమణదారుపై చర్య తీసుకోవాలి'



విలేకరులతో మాట్లాడుతున్న కొటం ఐలయ్య

దామెర : తన భూమిని ఆక్రమించిన వ్యక్తిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండలంలోని పసరగొండ గ్రామానికి చెందిన రైతు కొటం ఐలయ్య ప్రభుత్వాన్ని, పోలీసు శాఖ ఉన్నతాధికారులను కోరాడు. మండలంలోని ఊరుగొండ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊరుగొండలోని సర్వే నంబర్ 118లో తనకున్న 2.20 ఎకరాల భూమిలోని 0.4 గుంటల భూమిని చల్లా శ్రీనివాస్‌రెడ్డి ఆక్రమించినట్లు తెలిపాడు. శ్రీనివాస్‌రెడ్డి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. సర్వే నంబర్ 103లోని చెరువు శిఖం భూమి (ఎఫ్‌టీఎల్)ని ఆక్రమించాడని తెలిపాడు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయాడు. శ్రీనివాస్‌రెడ్డి భూమి నుంచి వర్షం నీరు వెళ్లేలా ఉన్న నాలాను అక్రమంగా మూసేసి తన భూమిలో తాను నిర్మించుకున్న ప్రహరీని కూల్చడంతోపాటు మూడు ఫీట్లు బేస్‌మెంట్‌ను, ప్రహరీని ధ్వంసం చేశాడన్నాడు. ఈ క్రమంలో వరదనీరు తన భూమిలో నుంచి వెళ్తుండడంతో తనకు సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని వివరించారు. ఇకనైనా రెవెన్యూ, పోలీసు శాఖల ఉన్నతాధికారులు స్పందించి శ్రీనివాస్‌రెడ్డి ఆగడాలపై సమగ్ర విచారణ చేపట్టి ఆక్రమణకు గురైన తన భూమిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసన



వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ నాయకులు

రాయపర్తి : ఎస్టీ వర్గీకరణ చేస్తామన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్, ప్రజా ప్రతినిధులు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై రాస్తారోకో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సీఎం కేసీఆర్ గిరిజనులకు పెంచిన 10శాతం రిజర్వేషన్‌కు మద్దతు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, ఆకుల సురేందర్‌రావు, పూస మధు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు జాజు నాయక్, మాలోత్ వసుంధర్, సర్పంచ్‌లు నర్సయ్య, జగన్ నాయక్, భద్రు నాయక్, దేదావత్ కమలవెంకన్న, కోదాటి దయాకర్‌రావు, నేతావత్ కిషన్‌నాయక్, మూనావత్ వెంకన్న, సంకినేని ఎల్లస్వామి, దేదావత్ ఉపేందర్, లావుడ్య నరేష్, తేరాల యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా ఎత్తిపోతల రహదారి

- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



చెన్నారావుపేట : చెన్నారావుపేట శివారులోని పాకాల వాగుపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పంపు వద్దకు వెళ్లే ప్రధాన రహదారి అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో ఉండగా రైతులు ఇబ్బంది పడుతున్నారు. కాగా బురదమయంగా ఉన్న రోడ్డును అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని కోపాకుల చెరువు కింద ఆయకట్టుకు సాగు నీరందించేందుకు పాకాల వాగుపై ఎత్తిపోతల పథకం ద్వారా పంపులు నిర్మించారు. ఈ క్రమంలో ఎత్తిపోతల పంపు వద్దకు వెళ్లడానికి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. కాటమయ్య గుడి నుంచి అర కిలోమీటరు వరకు రోడ్డు బురదమయంగా మారిందని, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లడానికి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు, పాలకులు ప్రత్యేక చొరవ తీసుకోని రోడ్డు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

'సిరికొండ'కే అసెంబ్లీ టికెట్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారయ్య

శాయంపేట : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భూపాలపల్లి నియోజకవర్గ టికెట్ సిరికొండ మధుసూదనాచారికే ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుడు పల్లెబోయిన సారయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2014 సార్వత్రిక ఎన్నికల్లో మధుసూదనాచారి భూపాలపల్లి నియోజకవర్గం నుంచి గెలిచి తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతిగా పనిచేశారని గుర్తు చేశారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అతి తక్కువ కాలంలో అభివృద్ధి చేసిన ఘనత సిరికొండ మధుసూదనాచారికే దక్కుతుందన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రజలందరూ మదన్న రావాలి మదన్నే కావాలని కోరుతున్నారని, ప్రజల కోరిక మేరకు సీఎం కేసీఆర్ సిరికొండ మధుసూదనాచారికి టికెట్ ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డికి టికెట్ ఇస్తే ఓడిపోవడం ఖాయమని, భూపాలపల్లి నియోజకవర్గంలో గండ్రకు పూర్తి వ్యతిరేకత ఉందని తెలిపారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి వచ్చినప్పటి నుంచి ఉద్యమకారులను పట్టించుకోకుండా తన అగ్రవర్ణ ఆధిపత్యం చెలాయిస్తున్నాడని, కేవలం తన ఆస్తులను, వ్యాపారాలను కాపాడుకోవడమే సరిపోతుందని తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గంలో గండ్ర చేసింది ఏం లేదని, నియోజకవర్గంలోని ప్రతి మండలంలోని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. సిరికొండ మధుసూదనాచారికి టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు కొత్త గట్టు సాయికృష్ణ, అరికిల్ల విజయ్, నమతబాజి అశోక్,ఆకాష్, సునీల్,సాంబమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



వర్ధన్నపేట: ఇల్లందలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగరాజు తదితరులు



సంగెం: పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు



రాయపర్తి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిల్లా వ్యాప్తంగా రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. రాజీవ్‌గాంధీ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



గీసుకొండ: కొనాయమాకులలో..



దుగ్గొండి: కేక్ కట్ చేస్తున్న తోకల శ్రీనివాసరెడ్డి



చెన్నారావుపేటలో..



నెక్కొండలో..



పర్వతగిరి: వేడుకలో కాంగ్రెస్ నాయకులు



నల్లబెల్లి: కేక్ కట్ చేస్తున్న చిట్యాల తిరుపతిరెడ్డి

'దళిత బంధు' వర్తింపజేయాలి

చెన్నారావుపేట : ప్రతీ దళితుడికి 'దళిత బంధు' పథకం వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దళితులు ఉన్నారని అన్నారు. ఓట్ల కోసం గ్రామాలలో దళిత కుటుంబాలకు రూ. 2 లక్షలు ఇస్తామని గ్రామాల్లో తిరుగుతున్నారని అన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికల కోసం ప్రకటించిన దళిత బంధు పథకాన్ని ఎన్నికలు పూర్తి కాగానే కేసీఆర్ మళ్లీ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో దళితబంధుని తెరమీదికి తెచ్చారని అన్నారు. పార్టీమారితేనే దళితబంధు ఇస్తామని గ్రామాల్లో ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. వాగులపై వంతెన నిర్మాణానికి ఐదేళ్ల కాలయాపన చేసి ఎన్నికల వేళ నిధులు మంజూరైనట్లు సర్వే పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు.